# సుఖం

— ములకలపల్లి కోటేశ్వరరావు

"కూలికి పోతారు. ఏ రోజు పది రూపాయలు ఆరోజు తెచ్చుకుని తింటారు. రేపు మాటేమిటి అనే దిగులూ, విచారమూ వుండే మీకూ! నిజంగా సుఖం అంటే మీదేనే!"అంది సౌభాగ్యమ్మ.

"పోండి అమ్మగారూ... ఎలక కాపరానికి పిల్లి ముచ్చట పడిందంట! మాదీ ఒక జలమేనా?" అంది మరియమ్మ.

"మీకేమే, చెప్పు! మా అన్ని బాధలు మీకున్నాయా! అసలు మీకు దిగులు ఎందుకుండిద్దే?"

"ఎందుకు వుండదులే అమ్మగారూ... ఎవురి దిగుళ్ళు వాళ్ళకుంటాయి!"

"ఏం దిగుళ్ళే మీకూ... అదునులో వానలు కురవలేదనో, లేకపోతే వానలు ఎక్కువయినీయ్యనో, పొలానికి పెట్టిన పెట్టుబడి రాదనో, పొలం పండలేదనో, పండిన పంటకి రేటు లేదనో దిగుళ్ళు మీకు వుండవు కదా!"

"ఏమో మాకున్న దిగుళ్ళు మాకుంటాయిలే అమ్మగారూ..."

"ఒక్కొక్కతి ఐదారుగురు పిల్లల్ని కనిద్ది. ఈ ఐదారుగురు కూలికిపోతే 50,60 రూపాయలు వస్తాయి! ఏమ్మా, ఇంట్లో అందరూ కూలికిపోయి రోజుకి 50, 60 రూపాయలు సంపాయించకవస్తుంటే ఏం బాధలమ్మా మీకూ..."

"రోజూ పనులు వుంటన్నయ్యా అమ్మగారూ... రెండు రోజులు పనులకి పోతే నాలుగురోజులు వూరకనే వుంటున్నాం కదా!"

"అంతేలే, రెండు రోజులు చాకిరీ చేసుకుంటారూ నాలుగురోజులు తినిహాయిగా పడుకుంటారూ..."

"తింటానికే లేకపోతే ఇంక ఏం పడుకోవటం అమ్మగారూ... పనికిపోతేనే పొట్టనిండిద్దికానీ, వూరక కూచుంటే ఎట్ట జరిగిద్దమ్మా? కూలికిపోతేనే కూడాయె, లేకపోతే పస్తాయె!"

"పస్తులు పడుకున్నా బాధలేదే! మా రైతుల మాదిరిగా దిగులు కూడు తినే కంటే అదే నయం. మాపని చూడు, ఒక పక్క అప్పులోళ్ళ పీకుడూ, ఇంకో పక్క బేంకోళ్ళ లాగుడూ! బేంకిలో కుదువ పెట్టుకున్న బంగారాన్ని వచ్చి విడిపించుకోకపోతే వేలం వేస్తామని నోటీసులు మీద నోటీసులు ఇస్తున్నారు. ఎట్ట చచ్చేటట్టూ, మీకు ఈ బాధలు లేవు కదా!"

"సరే లెండి అమ్మగారూ, నాకు రావల్సిన కూలి డబ్బులు ఇస్తేపోతాను."

"కూలోళ్ళకి ఒక్కొక్కరికి ఎంతెంత డబ్బు వుందే! ఒక్కొక్కరు నాలుగువేలూ, ఐదువేలూ మిగుల్చుకుని బేంకిలో వేసుకున్నారంట కదా?"

"మాకున్న డబ్బు యవారం చెప్పండి. మీరు ఇచ్చే పది రూపాయల కూలి డబ్బుల్లో మిగుల్చుకుని బేంకిల్లో కూడా వేసుకుంటున్నాం!"

"మీలో డబ్బులేనిది ఎవురికో చెప్పవే! సువార్తా వాళ్ళకి నాలుగువేలు వున్నయ్యా, ఏసూ వాళ్ళకి ఐదువేల వున్నాయా, వాళ్ళే చెప్పారు కదే వున్నా య్యనీ... అంతంత డబ్బు దాచి పెట్టుకుంటే ఇంక కావాల్సిందేముందీ? మాకే ముస్నయ్యి అప్పులూ, తిప్పలూ తప్ప!"


"మీ పొలం కాదు కానీ అమ్మగారూ, మీగేదెకి దూడ వుంది కాదా, దాని విలువ చేయవుమాకు వున్న ఆస్తులూ, డబ్బులూ! మాకున్న డబ్బు ఒక డబ్బేనంటమ్మగారూ..."

"ఆ డబ్బు చాలదంటే పిల్లలు పెట్టడానికీ,.. వడ్డీతోటి వడిగల గుర్రంకూడా పరిగెత్తలేదంట! ఆ డబ్బు మీద బోలెడు వడ్డీ కూడా వచ్చిద్దాయె, ఇంక కావల్సిందేం వుందే?"

మరియమ్మ కూలిడబ్బులు కోసమో, వాళ్ళ ఇంట్లో పని చేయడం కోసమో వచ్చిన ప్రతిసారీ సౌభాగ్యమ్మ అలాగే మాట్లాడుతుంది. కూలీలదే సుఖం అని కుండబద్దలు కొట్టకుండానే, కొట్టినంత ఘంటా పథంగా అంటుంది. కూలీలు చాలా సుఖపడిపోతున్నారని ఆమె నిశ్చితాభిప్రాయం.

మరియమ్మ తమకి సుఖం లేదనీ, తాము చాలా కష్టాలు పడుతుంటామనీ, పనులులేని ఎండాకాలంలో మూడు నాలుగు రోజులు కూడా పస్తులు పడుకుంటామనీ ఎంతగా చెప్పినా సౌభాగ్యమ్మ ఆ మాటల్ని ఆలకించదు.

సౌభాగ్యమ్మ వాళ్ళకి 25 ఎకరాల సుక్షేత్రమైన భూమి వుంది. వాళ్ళ పొలం ఎక్కడ వుందో కూడా ఆమెకి తెలియదు. పొలంపని అంతా



భర్తే చేయిస్తుంటాడు.

వాళ్ళకి ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు. ఒక అమ్మాయి ఇంజినీరింగ్ కోర్సు, ఒక అబ్బాయి పాలిటెక్నిక్కూ, మరో అబ్బాయి బిఎస్సీ చదువుతున్నారు. వాళ్ళ చదువులకోసం, కోచింగ్‌ల కోసం సౌభాగ్యమ్మ భర్త బోలెడు అప్పచేశాడు.

ఉండటానికి పొలం వున్నా, పిల్లల చదువుల కారణంగా సౌభాగ్యమ్మ వాళ్ళు అప్పల పాలయ్యారు.

వాళ్ళ పొలంలో పనికిపోయిన కూలీలకి కూలి

డబ్బులు కూడా త్వరగా ఇవ్వరు. వాళ్ళచేతిలో డబ్బులేక, ఇంటిచుట్టూ కూలీల్ని తిప్పించుకుని ఎవ్వడో ఇస్తారు.

సౌభాగ్యమ్మ వాళ్ళ ఇంటికి మరియమ్మ దాదావు రోజూ వస్తుంది. ఇంట్లో పనిచేస్తుంది, పొలంలో కూలీలతో పనిచేయిస్తుంది.

మరియమ్మ వచ్చిన ప్రతిసారీ మాటల సందర్భంలో సౌభాగ్యమ్మ తమకంటే కూలీలే బాగా బతుకుతున్నారనే అభిప్రాయం వ్యక్తం చేస్తుంది.

ఆ రోజు కూడా అలాగే అంది. " మీకేమే, పోయి సాల్లో కూర్చుంటారూ, పనిచేసినా, చెయ్యకపోయినా మాకు కూలి ఇయ్యక తప్పదాయె!"

"సరే వూరుకోండి అమ్మగారూ.... పనిచేయకుండా మీరు వూరక ఇస్తన్నారేంటి కూలి, అట్ట మాట్టాడతారు!"



"లేకపోతే మీరు పనిచేసి తీసుకుంటన్నారంటే కూలి డబ్బులు! మీ చిన్నదానికి ఎన్ని ఏళ్ళే? నిండా పదేళ్ళు లేవు ఆ గుంటకి! దాన్ని కూడా రోజూ కూళికి తీసుకుపోతంటివీ, దానికి కూడా మేం. కూలి ఇయ్యాల్సివస్తండే!"

"తల్లి యెనికెడితే బిడ్డ పోకుండా ఎట్ట వుండి ద్దమ్మా కూలికి? దానికి పదేళ్ళు అయితేనేం, ఎంత చురుగ్గా, ఎంత బాగా పనిచేసిద్దీ!"

"అబ్బో, నీ కూతురు ఏం చేసినా చేసిద్ది!" వ్యంగ్యంగా అంది సౌభాగ్యమ్మ.

"ఎందుకు చేయదమ్మగారూ, అట్టంటావు, దానితోపాటు నువ్వు చేస్తా పనీ!"

"నేను ఏందే, నీ కూతురితోపాటు ఈ వూళ్ళో ఎవురూ చేయలేరు. అసలు కూలోళ్ళకే డబ్బులు ఇయ్యడం దండగ అయితే దానికి తోడు నీ కూతురు ఒకతీ!"

తన కూతురు ఉచితంగా డబ్బు తీసుకుపోతున్నదని అనడంతో మరియమ్మకి కోపం వచ్చింది.


"సరే అమ్మగారూ.. మేం వూరక పనిచెయ్యకుండా, చేలోకి పోయి కూచుని డబ్బు తీసకపోతున్నట్టుగా వుంది మీ కంటికి. మీరు ఒకరోజు చేస్తే తెలిసిద్ది!"

"మాకు చేతకాదు లేవే పని చేయడం!"

"సరే అమ్మగారూ..... రేపు మీరు చేలోకిరండి, నా కూతురితో పాటు పనిచేయండి, చాలు, మాకు నాలుగురోజులు కూలి డబ్బులు ఇయ్యాలి కదా, నా కూతురితోపాటు పనిచేస్తే ఆ డబ్బులు వదులు కుంటాను!" పందెం కాసింది మరియమ్మ.

"ఏమేయ్, నీ కూతురితో పాటు పనిచేయలేననుకుంటన్నావా ఏందీ?"

"చేయండి అమ్మగారూ, తెలిసిద్ది, మా కూలోళ్ళే ఎందుకు సుఖపడాలీ, మీరు కూడా సుకపడు దురూ!"




ఇద్దరూ మాటా మాటా అనుకున్నారు. పంతం పెరిగింది. పందెం పెట్టుకున్నారు.

మరుసటి రోజు సౌభాగ్యమ్మ కూలీలతోపాటు చేలోకి వెళ్ళింది. మధ్యాహ్నం వరకూ వంగి కలుపు తీసింది. పందెంతో పట్టుదలగా పనిచేయాలని ప్రయత్నించింది.

ఎంత తొందరగా కలుపుతీసినా మరియమ్మ కూతురుతోపాటు తీయలేకపోయింది. కూలీలు కూడా సరదాగానే నవ్వారు.

"వూరుకోండి అమ్మగారూ... పందెం లేదూ, పాడూ లేదూ! ఎండకి ఎందుకు కమిలిపోతారు? పోయి రాగిచెట్టు క్రింద కూర్చోండి!" అని కూలీలు ఎంతగా బ్రతిమలాడినా సౌభాగ్యమ్మ వినలేదు.

వాళ్ళతో కలువు తియ్యాలనే చూసింది.

మధ్యాహ్నానికి ఆమె పని అయిపోయింది. ఇక చెయ్యలేక పోయింది. వెళ్ళి చెట్టుక్రింద కూర్చుంది. మళ్ళీ సాయంత్రం వాతావరణం చల్లబడిన తరువాత చేలోకి వచ్చి, కూలీలతోపాటు ఒక గంట కలుపు తీసింది.

మరపటి రోజు వుదయం మరియమ్మ పని చేయడానికి సౌభాగ్యమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళింది. సౌభాగ్యమ్మ మంచం మీద పడుకుని మూలుగుతూ వుంది.

"ఏందమ్మగారూ..... బాగాలేదా ఏందీ?" ఆందోళనగా అడిగింది మరియమ్మ.

"అమ్మో..... అయ్యో ...నడుములు నొప్పులే! నడుములు ఒకటే పీకుతున్నాయి. లేచి కూర్చోలేక పోతున్నానే! ఏదో జబ్బు వచ్చిందే నాకు. నడుములు ఇంత లావున నొప్పులు వుడతన్నాయ్యేమే! వెళ్ళి డాక్టర్ని పిలుచుకుని రావే! ఈయన ఇవ్వాళే వూరికి పొయ్యాడే!"

"నడుము నొప్పులా? అది జబ్బా కాదూ, ఏం కాదూ! వంగి కలువు తీసేసరికి వచ్చిన నొప్పులు అమ్మగారూ అవి!"

"అంతే నంటావా!? ఇదేం జబ్బు కాదంటావా? ఎందుకో నాకు భయంగా వుందే!"

"భయం ఎందుకూ! ఏం కాదు. మళ్ళీ ఇయ్యాల కూడా రండి అమ్మగారూ, సాయంత్రానికి నొప్పులూ గిప్పులూ అన్నీ తగ్గిపోతయ్యి!"

"ఇంకెక్కడికి వచ్చేదే, అసలు మంచమే దిగలేక పోతున్నానే!"

"సుఖం అంటే మా కూలోళ్ళదే అమ్మగారూ. పోయి చేలో కూసుని డబ్బులు తెచ్చుకోవడమేగా!"

"వూరుకోవే, నువ్వూ నీ మాటలూనూ!" చిరుకోపంతో మందలించింది సౌభాగ్యమ్మ.

For Your requirement of quality Computer Stationery-pre-printed, blank, EZR and Multi-part.

Please Contact:

**M/s. BANG DATAFORMS PVT. LTD.,**

29-6-33, Ramachandra Rao Road, Suryaraopet,
VIJAYAWADA-520 002.
Phones: 432179, 436910.
Rajahmundry: Ph: 71004, 76850.
Visakhapatnam: Ph: 548022.
Guntur: Ph: 224493; 220046